సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం। 23 । ఫిబ్రవరి। 2025



పెట్రోల్ బంకుల తనిఖీ

కడప రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ జి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం విజిలెన్స్ అధికారులు పెట్రోల్ బంకులలో ఆకస్మిక తనిఖీ చేశారు. - 8లో



రైతులతో చెలగాటం

కడప -నంద్యాల జిల్లాల సరిహద్దు గ్రామాల్లో 1500 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించ తలపెట్టిన సెల్ సోలార్ పవర్ ప్రాజెక్టు వివాదాస్పదంగా మారుతోంది - 8లో

గరిష్ఠం/కనిష్ఠం 36.2 /20.9

వాతావరణం

జిల్లాలో శనివారం 20.9 - 36.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

నేడు సీఎస్, డీఓలకు సమావేశం

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా మార్చి 1 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణ నిమిత్తం పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, కస్టోడియన్లు, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లకు ఆదివారం సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఇంటర్మీడియట్ ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. సంబంధిత సమావేశం ఉదయం 10 గంటలకు కడప మరియాపురం సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాల సెమినార్ హాల్‌లో ఉంటుందని వివరించారు. ఉత్తర్వులు పొందిన వారంతా విధిగా సమావేశానికి హాజరుకావాలని ఆర్ఐఓ తెలిపారు.

నేడు 'బ్రౌన్'లో సాహితీ సదస్సు

కడప కల్చరల్ : యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు సాహితీ సదస్సు నిర్వహించనున్నారు. నెలనెల సీమ సాహిత్యం కార్యక్రమంలో భాగంగా 141వ సదస్సుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆచార్య కొలకలూరి ఇనాక్ నవలా సాహిత్యం అనే అంశంపై శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పరిశోధక విద్యార్థి జి.రమేష్‌బాబు ప్రసంగించనున్నారు.

25 నుంచి కల్యాణ మహోత్సవాలు



బ్రహ్మంగారిమఠం

బ్రహ్మంగారిమఠం : కాలజ్ఞాన ప్రబోధకర్త శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో ఈ నెల 25 నుంచి మార్చి 1వరకు బ్రహ్మంగారు, గోవిందమాంబల కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు మఠం మేనేజర్ ఈశ్వరాచారి తెలిపారు. ఈ ఉత్సవాలను మఠం పిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 26 మహాశివరాత్రి రోజున బ్రహ్మం స్వామి కల్యాణాన్ని తిలకించేందుకు ఆంధ్రా, తెలంగాణా, కర్నాటక, రాష్ట్రాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారని మేనేజర్ తెలిపారు. 5రోజులు పాటు జరిగే ఉత్సవాలలో ప్రతి రోజూ హరికథలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, ప్రవచనలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

రాములోరి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పూర్తి చేయాలి

– టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం



ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు జేఈఓ వి వీరబ్రహ్మం సూచించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. కోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 6 నుంచి 15వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఏప్రిల్ 11న జరగనున్న సీతారాముల కల్యాణానికి ముందస్తుగా అనుమతులు తీసుకుని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. శ్రీ సీతారాముల కళ్యాణానికి పెద్దసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. త్వరలో కడప జిల్లా అధికారులతో సమన్వయ సమావేశాన్ని టీటీడీ ఈఓ జె శ్యామలరావు నిర్వహించనున్నట్లు తెలిపారు. కేవలం 45 రోజులు గడువు ఉన్న నేపథ్యంలో ముందస్తుగా చెక్ లిస్టు పెట్టుకొని, అందుకు అనుగుణంగా మార్చి నెల చివరి నాటికి ఏర్పాట్లు పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో సీఈ సత్యనారాయణ, ఎస్ఈ (ఎలక్ట్రికల్) వెంకటేశ్వర్లు, ఒంటిమిట్ట ప్రత్యేక అధికారి ప్రశాంతి, డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, అన్నప్రసాద ప్రత్యేకాధికారి జీఎల్ఎన్ శాస్త్రి, హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శి శ్రీరామ్ రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ నియామకం

సిద్ధవటం : శ్రీ నిత్యపూజ స్వామి ఆలయంలో ఈనెల 25 నుంచి మూడురోజుల పాటు జరిగే మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు దేవదాయశాఖ అధికారులు శనివారం ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు. అందులో భాగంగా 10 మంది సభ్యులతో కూడిన కమిటీని నియమించారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్‌గా వంతాటిపల్లె గ్రామానికి చెందిన జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, సభ్యులుగా గంగాదేవి, చెన్నమ్మ, రమణయ్య, బాలసుబ్రమణ్యం, లక్షుమ్మ, నరసింహారెడ్డి, పుల్లమ్మ, ఎరికలయ్య, మునీంద్ర, శేషాద్రిశర్మ నియమితులయ్యారు.

ఎన్జీఓలపై టీడీపీ పిడుగు!



ఎన్జీఓ ప్లాట్లు పరిశీలిస్తున్న టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి తదితరులు

- మహానాడు కోసం ఎన్‌జీఓ ప్లాట్లను ఎంచుకున్న టీడీపీ నేతలు
- యంత్రాలతో చదును చేసేందుకు సన్నాహాలు
- లబ్ధిదారులకు అప్పగించాం.. మేము చేసేది లేదంటున్న సొసైటీ ప్రతినిధులు
- లబోదిబోమంటున్న హౌసింగ్ ప్లాట్స్ లబ్ధిదారులు

సాక్షి ప్రతినిధి, కడప: నాన్ గెజిటెడ్ అధికారులకు కొత్త చిక్కులు వచ్చి పడ్డాయి. తెలుగుదేశం నేతల చర్యల కారణంగా వారి జీవితాల్లో అలజడి రేగుతోంది. ఒకరా ఇద్దరా ఏకంగా 5400 కుటుంబాలకు చెందిన లబ్ధిదారులు హైరానా చెందుతున్నారు. తెలుగుదేశం మహానాడు నిర్వహణకు ఎన్‌జీఓల ప్లాట్స్ ఎంచుకోవడమే అందుకు ప్రధాన కారణం. ఇప్పటికే రోడ్లు, ప్లాట్లు చదును చేసే ప్రక్రియకు తెలుగుతమ్ముళ్లు సిద్ధమయ్యారు. లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించాం, మాకేటి సంబంధం అన్నట్లుగా హౌస్ బిల్డింగ్ సొసైటీ వ్యవహరిస్తోంది. వెరసి జిల్లాలోని ఎన్‌జీఓ ప్లాట్ల లబ్ధిదారులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

కడప నగరం సెంట్రల్ జైలు సమీపంలో 340 ఎకరాలు ఎన్‌జీఓ హౌస్ బిల్డింగ్ సొసైటీకి అప్పగించారు. డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అనుమతులతో ప్లాట్లుగా విభజించుకున్నారు. అందులో 5400 మంది లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించి, ఆమేరకు లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ కూడా అయ్యాయి. 30, 40, 60 అడుగుల రోడ్లు కూడా ఏర్పాటు చేసుకున్నారు. ప్లాట్లు ఆధారంగా నెంబరు రాళ్లు కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఆమేరకు కొందరు పునాదులు, బేస్‌మట్టాలు వేసుకున్నారు. మరికొందరు ఇళ్ల నిర్మాణం కూడా చేపట్టారు. కాగా ప్రస్తుతం ఆ స్థలాల్లో తెలుగుదేశం పార్టీ మహానాడు నిర్వహించేందుకు సన్నాహాలు చేపట్టారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి శనివారం అనుచరులతో వెళ్లి పరిశీలించారు. దాదాపు 10 మిషన్లు పెట్టి ఎన్‌జీఓ ప్లాట్లు చదును చేయాలని సంకల్పించారు. ఈవిషయం తెలియడంతో ఎన్‌జీఓల్లో తీవ్ర అలజడి రేగుతోంది.

కోట్లాది రూపాయలు వెచ్చింపు...

ఎన్‌జీఓ హౌస్ బిల్డింగ్ సొసైటీ నేతృత్వంలో లబ్ధిదారుల ప్లాట్లు రాళ్లు, ఇంటర్నల్ రహదారుల నిర్మాణానికి కోట్లాది రూపాయాలు వెచ్చించారు. అవన్నీ సొసైటీ సభ్యుల ఆర్థిక సహకారంతో చేపట్టినవే. కాగా తెలుగుదేశం పార్టీ నేతల చర్యలు కారణంగా రోడ్లు, ప్లాట్లు రూపురేఖలు మారిపోనున్నాయి. మొత్తం చదును చేస్తే ఎవరి ప్లాటు ఎక్కడ అన్న సందిగ్ధం ఉత్పన్నం కాకపోదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికే లబ్ధిదారులు కొందరు చనిపోయారు. మరికొందరు విక్రయించుకున్నారు, ఇంకొందరు పిల్లలకు పసుపు కుంకాలు కింద ఆడబిడ్డలకు ఇచ్చి పెళ్లిళ్లు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో కలగా పులగం అన్నట్లుగా ప్లాట్లన్నీ చదును చేయాలనే దిశగా టీడీపీ నేతలు నిర్ణయానికి వచ్చారు. అధికార పార్టీ చర్యలకు అడ్డు చెప్పే సాహసం ఎవరూ చేయలేకున్నట్లు తెలుస్తోంది. చివరికి హౌస్ బిల్డింగ్ సొసైటీ సైతం కిమ్మనకుండా ఉండిపోయినట్లు సమాచారం. ప్రభుత్వ స్థలాలు, భూములు అనేకం ఉన్నా ఎన్‌జీఓ ప్లాట్లనే ఎంచుకోవడం దుర్మార్గం, దురుద్దేశం దాగి ఉందని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులు



కడప కోటిరెడ్డిసర్కిల్ : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ నుంచి వివిధ శైవ క్షేత్రాలకు 1370 బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ కడప జోన్ ఈడీ చంద్రశేఖర్ తెలియజేశారు. కడపజోన్ పరిధిలోని కర్నూలు జిల్లా శ్రీశైలంకు 275, గురజాల 14, నంద్యాల జిల్లా నుంచి శ్రీశైలంకు 178, మహానంది 25, ఓంకారం 10, యాగంటి -10, బ్రహ్మగుండం 15, వైఎస్సార్ జిల్లా పొలతలకు143, నిత్యపూజ కోన 35, లంకమల 34, బి. మఠం 17, అల్లాడుపల్లి దేవలాలు 10, జ్యోతికి 8 బస్సులు నడపనున్నామని వివరించారు.అలాగే అన్నమయ్య జిల్లా మల్లెం కొండ -84, పొలతలకు 34, ఝరి 28, హత్యారాల 20, తిరుపతి జిల్లా నుంచి శ్రీకాళహస్తికి 68, తలకోన 55, సదాశివకోన 59, చిత్తూరు జిల్లా అగస్త్యేశ్వరకొండ 44, మొగిలి 39, మల్లప్ప కొండ 28, దుర్గం కొండ 12, సిద్దేశ్వర కొండ 12 బస్సులు నడుస్తాయన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శైవక్షేత్రాలకు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని సూచించారు.

అభివృద్ధి వైపు జిల్లా ముందడుగు

కేంద్ర ఆర్థిక సేవారంగ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎంజీ జయశ్రీ



మాట్లాడుతున్న ఎంజీ జయశ్రీ , చిత్రంలో జేసీ

కడప సెవెన్‌రోడ్స్ : ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధి సాధనలో భాగంగా ఆర్థిక పరిపుష్టితో పాటు అన్ని ప్రామాణికాలలో వైఎస్ఆర్ జిల్లా ముందంజలో కొనసాగడం అభినందనీయమని కేంద్ర ఆర్థిక సేవారంగ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎంజీ జయశ్రీ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అధ్యక్షతన ఆకాంక్షిత జిల్లాలో 'ఆర్థిక పరిపుష్టి - కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్'అనే అంశంపై బ్యాంకు అధికారులు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నుంచి ఆర్థిక సేవారంగ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎంజీ జయశ్రీ ముఖ్య అతిథిగా హాజరు కాగా వారితోపాటు కెనరా బ్యాంక్ డీజీఎం ఆర్తి అగర్వాల్, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎంజీ జయశ్రీ మాట్లాడుతూ ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధి సాధనలో భాగంగా ఆర్థిక పరిపుష్టి, నైపుణ్య అభివృద్ధి అనే అంశాల్లో అత్యుత్తమ పనితీరును కనబరిచినందుకు వైఎస్ఆర్ జిల్లాకు కేంద్ర ప్రభుత్వం 'నీతీ ఆయోగ్'ద్వారా అత్యుత్తమ పురస్కారం బహుకరించడం అభినందనీయమన్నారు. ఆకాంక్ష జిల్లాల లక్ష్య సాధనలో ఆర్థిక పరిపుష్టి అనే ప్రామాణిక పాత్ర 10 శాతం శాతమే అయినా.. బ్యాంకర్ల సహకారం ఎంతో కీలకమైనదన్నారు. బ్యాంకర్లు సమర్థవంతంగా పని చేస్తేనే ఆర్థిక వ్యవస్థ మరింత దృఢంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా జిల్లాలో డీఆర్డీఏ, మెప్మా పరిధిలోని అన్ని స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసి జిల్లా ఆర్థిక అభివృద్ధిలో మహిళా సంఘాలను భాగస్వామ్యం చేయాలన్నారు. బ్యాంకర్లు పొదుపు సంఘాల మహిళలకు రుణాలు అందించి ఆర్థిక చేయుతనివ్వాలన్నారు. కార్యక్రమంలో ముందుగా జేసీ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి కోసం జిల్లా పరిపాలన యంత్రాంగం, ఆయా శాఖల అధికారులు కూడా నిబద్ధతతో పనిచేస్తున్నారన్నారు. అనంతరం జిల్లాలోని అన్ని బ్యాంకులకు నిర్దేశించిన పలురకాల రుణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని, ఆకాంక్షిత జిల్లా లక్ష్య సాధనలో భాగంగా కీ పాయింట్ ఇండికేటర్స్‌పై ఆయా బ్యాంకుల ప్రతినిధులతో డిప్యూటీ డైరెక్టర్ జన రల్ సమీక్షించారు. జిల్లా లీడ్ బ్యాంకు చీఫ్ మేనేజర్ జనార్దనం పలు శాఖల ద్వారా ప్రభుత్వం అందజేస్తు న్న రుణాల ప్రగతిని వివరించారు. నాబార్డ్ ఏజీఎం విజయ విహారి, రిజర్వ్ బ్యాంక్ ఎల్డిఓ నవీన్ కుమార్, కెనరా బ్యాంకు ఏజీఎం మురళి మోహన్, ఎస్బీఐ ఏజీఎం వాణీ కిషోర్ కుమార్ రెడ్డి, యూబీఐ ఏజీఎం లక్ష్మీ తులసి, ఏపీజీబి ఏజీఎం శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

ఆకేపాటిపై అక్కసు

- సార్వత్రిక ఎన్నికల్లో పట్టు నిరూపించుకున్న ఎమ్మెల్యే
- కక్షసాధింపు చర్యల్లో భాగంగా కుటుంబంపై విష ప్రచారం

సాక్షి రాయచోటి : అందరికీ సుపరిచితుడు...మృదుస్వభావిగా పేరెన్నికగన్న ఆయన ఒక నియోజకవర్గానికి ఎమ్మెల్యే... యేటా వెంకటేశ్వరస్వామిపై భక్తితో అన్నమయ్య కాలిబాట రహదారిలో తిరుమలకు వెళుతూ ఆధ్యాత్మిక వేత్తగా అందరి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. అందుకే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభావం కనిపించినా రాజంపేట నియోజకవర్గంలో మాత్రం ఆకేపాటి అమర్‌నాథరెడ్డే కావాలంటూ ఎమ్మెల్యేగా ప్రజలు గెలిపించారంటే ఆయనకున్న పట్టు ఏపాటిదో ఇట్టే అర్థమవుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజాప్రతినిధిగా నేరుగా ఎదుర్కొనలేక తెరవెనుక కుట్రలు, కుతంత్రాలకు తెర తీశారు. ఈ కోవలోనే ఆకేపాటిని మానసికంగా దెబ్బతీయాలన్న లక్ష్యంతో అక్రమణల పేరుతో విష ప్రచారం ఒడిగట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే వైఎస్సార్ సీపీలోని కీలక నేతల ఆర్థిక మూలాలను దెబ్బతీసి వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది.

జిల్లా అధ్యక్షుడి కుటుంబంపై కుట్రలు

వైఎస్సార్ సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డితోపాటు ఆయన కుటుంబంపై కుట్రలు కొనసాగుతున్నాయి. వైఎస్ కుటుంబానికి విధేయుడిగా ఉంటూ మంచి మనిషిగా గుర్తింపు పొందిన ఆకేపాటిని పార్టీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఈ నేపథ్యంలోనే ఆకేపాటిని అభాసుపాలు చేయాలన్న దురుద్దేశంతో అధికారుల ద్వారా దెబ్బతీసే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఆయన ఇంటిని అక్రమంగా నిర్మించుకున్నారని, అక్రమంగా భూములు సాగు చేస్తున్నారని ఆరోపిస్తూ విష ప్రచారానికి తెర తీశారు. అయితే కుట్రలను ఆకేపాటి దీటుగా ఎదుర్కొంటున్నారు. ఎప్పుడూ కూడా అవినీతి అక్రమాలకు దూరంగా ఉంటున్నామని, నిజాయితీ నిబద్ధతతో ముందుకెళుతున్నట్లు ఇప్పటికే ఆయన స్పష్టం చేశారు.

ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టే వ్యూహం

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి సర్కార్ అధికారంలోకి రాగానే వైఎస్సార్ సీపీ కీలక నేతలపై కక్ష కట్టారు. వారి ఆర్థిక మూలాలతోపాటు ఆస్తులను దెబ్బతీసేలా కూటమి నేతలు వ్యూహం అమలు చేస్తున్నారు. సదరు నేతలు తెరవెనుక ఉంటూ అధికారుల ద్వారా పథకం రచించి అమలు చేస్తున్నారు. ఈ కోవలోనే ఉమ్మడి వైఎస్సార్ జిల్లా డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డికి సంబంధించిన భూముల విషయంలోనూ అధికారుల ద్వారా సర్వే పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కలకడ ఎంపీపీ ఇంటిపై కూడా దాడులు నిర్వహించడం, మాజీ ఎంపీపీ రెడ్డెయ్య ఇంటిపై దాడుల ఘటనలు కూడా ఆందోళన కలిగించే పరిణామం. ఇటీవల రామాపురం , రాయచోటి, రాజంపేట ఇలా పలు మండలాల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు సంబంధించిన స్థలాలు, ఇళ్లను ఆక్రమణల పేరుతో కూల్చి వేస్తుండడం ఆందోళన కలిగించే పరిణామం.

ఘనమైనది కడప ఉర్దూ సాహితీ చరిత్ర



హాజరైన వివిధ జిల్లాల ప్రతినిధులు




సమావేశంలో మాట్లాడుతున్న వైవీయూ రిజిస్ట్రార్ డాక్టర్ పుత్తాపద్మ

వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ


కడప ఎడ్యుకేషన్ : భారతీయ సంస్కృతి సాహిత్యాలలో ఉర్దూ భాషకు ప్రత్యేక గుర్తింపు ఉందని ప్రత్యేకించి కడప ఉర్దూ సాహితీ చరిత్ర ఘనమైందని యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ అన్నారు. యోగి వేమన యూనివర్సిటీ ఉర్దూ విభాగ అధిపతి ఆచార్య కె.రియాజున్నీసా ఆధ్వర్యంలో శనివారం 'కడపలో ఉర్దూ సాహిత్యం' అనే అంశంపై జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఈ సెమినార్‌కు ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ హాజరై మాట్లాడుతూ ఉర్దూ సాహిత్యానికి ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. రెండవ భాష ఉర్దూ అమలు చేస్తున్న రాష్ట్రాల్లో యూపీ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉన్నాయన్నారు. ఉర్దూ భాష సారాంశంలో ప్రేమ, సోదర భావం, శాంతి సామరస్యం, జాతీయ సమైక్యత ఇమిడి ఉందన్నారు. ఉర్దూ సాహిత్యం గాలిబ్, ఇక్బాల్ లాంటి మహోన్నత కవులను ఆదరించిందని తెలిపారు. సూఫీజాన్ని అమీర్ కుస్రో బోధించారని, వేమన, ఇక్బాల్ భావాలు ఒకటేనని ఉదహరించారు. ఉర్దూ సాహిత్యంలో ఆధ్యాత్మిక చింతన ఉందని, సి. నారాయణరెడ్డి గజల్ ప్రక్రియను తెలుగు సాహిత్యానికి పరిచయం చేశారన్నారు. గౌరవ అతిథి వై వి యు హ్యూమానిటీస్ విభాగ డీన్ ఆచార్య కంకణాల గంగయ్య మాట్లాడుతూ సాహిత్యం సామాజిక వాస్తవికతకు అద్దం పట్టాలన్నారు. ప్రస్తుత పరిపాలన విధానాలపై విశ్లేషించారు. మాజీ కులసచివులు ఆచార్య నజీర్ అహ్మద్ మాట్లాడుతూ ఉర్దూ కడప జిల్లా సాహిత్యం గురించి వివరించారు. చెన్నై ఉర్దూ ప్రొఫెసర్ డాక్టర్ సయ్యద్ సజ్జాద్ హుస్సేన్ మాట్లాడుతూ జాతీయ సదస్సు ద్వారా ఉర్దూ సాహిత్యానికి ప్రయోజనం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉర్దూ భాషా వికాసానికి అందరూ కృషి చేయాలని కోరారు. గౌరవ అతిథి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఉర్దూ విభాగం అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎ.ఎం.ఫజులుల్లా మాట్లాడుతూ సెమినార్ అంశం అద్భుతంగా ఉందని కితాబిచ్చారు. విశ్వవిద్యాలయంలో సాహితీ ప్రక్రియల గురించి సమావేశాలు నిర్వహించాలని తద్వారా ఎన్నో కొత్త విషయాలు వెలుగుచూస్తాయన్నారు. కర్నూల్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ విశ్రాంత రిజిస్ట్రార్ డాక్టర్ సత్తార్ సాహిర్ మాట్లాడుతూ కర్నూలు కడప గుంటూరులోని యూనివర్సిటీలు ఉర్దూ సాహిత్య అభివృద్ధికి కృషి చేస్తున్నాయన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఖాసిం అలీ ఖాన్ , ఉర్దూ విభాగ అధిపతి ఆచార్య కె.రియాజున్నీసా మాట్లాడారు. పరిశోధకులు ఆచార్య పజులుల్లా, హుసేని బాషా షహమీరి, డాక్టర్ వసీవుల్లా భక్తియారి, డాక్టర్ సాజియా బేగం, డాక్టర్ ఇక్బాల్ కుస్రో ఖాద్రి, డాక్టర్ ఫైజల్లాహ్, డాక్టర్ కే ఇంతియాజ్, ఖాదర్ ఖాన్ డెల్టాకు, సత్తార్ ఫైజి, అన్వార్ హాజీ, సర్తాజ్ బేగం, మహబూబ్ ఖాన్, షేక్ ఆలియా, ఉర్దూ సాహిత్యం పై పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా వైవీయూ ఉర్దూ శాఖ తరఫున అతిథులను సత్కరించారు.

తొలి స్వాతంత్ర్య యోధుడు ఉయ్యాలవాడ

వర్ధంతి సభలో ఎమ్మెల్యే ఆకేపాటి



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అతిథులు



పాల్గొన్న వివిధ సంఘాల ప్రతినిధులు

కడప సెవెన్‌రోడ్స్ : ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ప్రథమ స్వాతంత్ర్య యోధుడని, ఆయన తిరుగుబాటు జాతీయోద్యమానికి ఎంతో ప్రేరణ ఇచ్చిందని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అన్నారు. రేనాటి సూర్యచంద్రుల విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన ఉయ్యాలవాడ వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈస్ట్ ఇండియా కంపెనీ దోపిడీ, ఆధిపత్యాలను ఎదిరించిన సాహసి అని కొనియాడారు. తిరుగుబాటును కర్కశంగా అణిచివేసిన బ్రిటీషర్లు నరసింహారెడ్డి కోయిలకుంట్లలో బహిరంగంగా ఉరి తీసి ప్రజలను భయభ్రాంతులను చేసేందుకు 30 ఏళ్లు ఆయన తలను అలాగే ఉంచారన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన పోరాటం, త్యాగం మరువలేనిదని, రాష్ట్ర ప్రభుత్వం ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరారు. కడపలో ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి విగ్రహ ఏర్పాటుకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. అధ్యక్షత వహించిన మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్.హరీంద్రనాథ్ మాట్లాడుతూ నేటి తరానికి స్ఫూర్తినిచ్చేందుకు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి చరిత్రలను పాఠ్యాంశాల్లో చేర్చాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. నంద్యాలకు చెందిన సీనియర్ జర్నలిస్టు కాశీపురం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నరసింహారెడ్డిని ప్రథమ స్వాతంత్ర్య యోధునిగా గుర్తించాలన్నారు. రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి రాయలసీమ ప్రాంతానికి చెందిన వ్యక్తి కావడం వల్లే చరిత్రకారులు ఆయనను విస్మరించారని తెలిపారు. ఇది చాలా ఏళ్లుగా రాయలసీమపై అమలవుతున్న వివక్షలో భాగమేనని తెలిపారు. రూపనగుడి గ్రామానికి చెందిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వారసుడు కర్నాటి మహేంద్రనాథ్‌రెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి కన్వీనర్ దేవగుడి చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, ఏపీ నీటి సంఘం నాయకులు ఎల్వీ భాస్కర్‌రెడ్డి, హిమబిందు, రెడ్డి సేవా సమితి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.నాగిరెడ్డి, లెక్కల కొండారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పద్మప్రియ చంద్రారెడ్డి, నంద్యాలకు చెందిన సీనియర్‌పాత్రికేయులు జనార్దన్‌రెడ్డి, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. అతిథులు కర్నాటి మహేంద్రనాథ్‌రెడ్డి, కాశీపురం ప్రభాకర్‌రెడ్డి జనార్దన్‌రెడ్డిలను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

క్లుప్తంగా

ఇంటి పన్ను చెల్లించలేదని షాపు సీజ్


అధికారులకు సూచనలు ఇస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు : గత నాలుగేళ్లుగా మున్సిపాలిటీకి సంబంధించిన ఇంటి పన్ను బకాయి చెల్లించకపోవడంతో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున శనివారం స్వయంగా గాంధీ రోడ్డులోని షాపును సీజ్ చేయించారు. గాంధీ రోడ్డులోని షాపునకు సంబంధించి 2021 నుంచి ఇప్పటి వరకు రూ.4,45,623 ఇంటి పన్ను చెల్లించాల్సి ఉంది. పలు మార్లు అధికారులు నోటీసులు జారీ చేసినా యజమాని బాషా స్పందించలేదు. దీంతో కమిషనర్ షాప్‌ను సీజ్ చేయించారు. కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీకి సంబంధించి రూ.19 కోట్లు ఇంటి పన్ను బకాయిలు, రూ.4.5 కోట్లు నీటి పన్ను బకాయి రావాల్సి ఉందన్నారు. ప్రజలు పన్ను బకాయిలు చెల్లిస్తే మున్సిపాలిటీ అభివృద్ధి చెందుతుందన్నారు. బకాయిల వసూలుకు రంగం సిద్ధం చేశామన్నారు. కమిషనర్ వెంట ఆర్‌ఐ శివచరణ్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గ్రామ పరిశుభ్రత మనందరి బాధ్యత


తడి పొడి చెత్తలను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి

ఖాజీపేట : మన ఇంటిలోని చెత్తను వీధిలో వేయకుండా పారిశుద్ధ్య కార్మికులకు అందించినప్పుడే మన వీధులతో పాటు గ్రామం బాగుంటుందని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి సూచించారు. ఖాజీపేట మేజర్ పంచాయతీ, పుల్లూరు పంచాయతీల్లో ఆమె ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి నుంచి చెత్తను తీసుకువచ్చేటప్పుడు తడి, పొడి చెత్తలను వేరుగా చేసి ఇవ్వాలన్నారు. అందుకోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను పంచాయతీ అధికారులకు, పారిశుద్ధ్య కార్మికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమణారెడ్డి, శ్రీనివాసులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులతో చెలగాటం

- రైతుల అనుమతి లేకుండా భూముల్లో స్తంభాలు నాటుతున్న సోలార్ యాజమాన్యం
- సెల్ కంపెనీ తీరుపై రైతుల మండిపాటు
- పెద్దముడియం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు
- వివాదాస్పదంగా సోలార్ ప్రాజెక్టు నిర్మాణం


పంట పొలంలో నాటిన స్తంభాలు

జమ్మలమడుగు/మైలవరం : కడప –నంద్యాల జిల్లాల సరిహద్దు గ్రామాల్లో 1500 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించ తలపెట్టిన సెల్ సోలార్ పవర్ ప్రాజెక్టు వివాదాస్పదంగా మారుతోంది. కంపెనీ కొనుగోలు చేయని రైతుల భూముల్లో కూడా గుంతలు తీసి కంచె వేస్తుండటంపై స్థానికులు సోలార్ యాజమాన్యంపై మండిపడుతున్నారు. తమకు జరిగిన అన్యాయంపై పెద్దముడియం మండలం కొండ కల్వటాల గ్రామానికి చెందిన బాధిత రైతులు పెద్దముడియం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కంపెనీ యాజమాన్యం మధ్యవర్తుల ద్వారా రైతులతో మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. పొలాలు లీజుకు ఇవ్వడం గాని, పూర్తి కొనుగోలుకు గాని తమకు సహకరించాలని కోరుతున్నట్లు తెలుస్తోంది.

అసలేం జరిగిందంటే..

పెద్దముడియం మండలం కల్వటాల గ్రామ పంట పొలాల్లో సెల్ సోలార్ కంపెనీ భూములను లీజుకు ఇవ్వని రైతుల పంట పొలాల్లో వారి అనుమతులు లేకుండా స్తంభాలు పాతుతోంది. కల్వటాల గ్రామంతోపాటు ఉయ్యాలవాడ మండలంలోని గోవిందపల్లి, మాయలూరు గ్రామాలలో పంట పొలాలతో కలిసి సుమారు 1500 ఎకరాల్లో సోలార్ ప్లాంట్ కోసం రైతుల భూములను లీజుకు తీసుకునేందుకు ముందుకు వచ్చింది. వెంటనే రంగంలోకి దిగిన కంపెనీ రైతుల నుంచి భూములను లీజుల రూపంలో ఎకరాకు రూ.32 వేలు చొప్పున ఏడాదికి అందిస్తామని తెలిపింది. దీంతో చాలా మంది రైతులు తమ పంట పొలాలను ఇచ్చేందుకు మక్కువ చూపలేదు. దీంతో దళారులను కంపెనీ రంగంలోకి దింపింది. కొంత మంది రైతులు తమ పొలాలను లీజుకు ఇస్తే రాబోయే రోజుల్లో పంటలకు పనికి రావని అందువల్ల లీజుకు ఇచ్చేది లేదని తెగేసి చెప్పడంతో కంపెనీ ప్రతినిధులు డోలాయమానంలో పడ్డారు. ఈ పరిస్థితుల్లో ఎలాగైనా సరే రైతుల నుంచి భూములు సేకరించాలనే లక్ష్యంతో దళారుల ద్వారా బినామీ పేర్లతో భూములు కొనుగోలు చేస్తోంది. ఇటీవల కాలంలోనే 300 ఎకరాల భూమిని కొనుగోలు చేసినట్లు సమాచారం.

ఒప్పుకోని రైతులకు అదనంగా డబ్బులు..

భూములు ఇచ్చేది లేదని కరాఖండిగా చెప్పిన రైతుల వద్దకు కంపెనీ దళారులను పంపించి వారిని పిలిపించుకుని కొనుగోలుకు సిద్ధపడింది. చుట్టుపక్కల గ్రామాల్లో పెద్దలుగా చెలామణి అయ్యేవారినే బినామీలుగా రంగంలోకి దింపి వారి ద్వారా కొనుగోలు పర్వానికి తెర లేపింది. ఎప్పుడూ కొనుగోలు చేయని పెద్దలు ఈ కంపెనీ వచ్చిన తర్వాత ఒక్కసారిగా భూముల కొనుగోలుకు రావడం అందరిని ఆశ్చర్యపరిచింది. వాస్తవంగా రైతులకు ఎకరాకు ఏడు లక్షల రూపాయల నుంచి రూ.10 లక్షల వరకు కొంత మంది రైతులకు, అధికార బలం ఉన్న రైతులకు 10 లక్షల నుంచి 18 లక్షల రూపాయల వరకు వెచ్చించి భూములను కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా పొలాలు ఇవ్వకపోతే మీ పొలాలకు దారి లేకుండా చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని కొందరు రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం మాట వినని రైతుల భూముల్లో రాత్రికి రాత్రే రంధ్రాలు వేసి ఫినిషింగ్ స్తంభాలను నాటుతున్నారు. ఇదేమని అడిగితే పొరపాటున వేసినట్లు ఉన్నారని చెబుతూనే కంపెనీ దళారులతో మధ్యవర్తిత్వం చేయిస్తోంది. ఎలాగూ పొలంలో స్తంభాలు నాటారు కనుక మీ భూములరేటు చెప్పండంటూ బేరం పెడుతున్నారు.


పొలంలో వేసిన గుంతలు

కొంచెం చెక్కు.. మరికొంత నగదు రూపంలో..

సోలార్ కోసం భూములను అమ్మిన రైతులకు దళారులు కొంచెం చెక్కు రూపంలో మరి కొంత నగదు రూపంలో ఇవ్వడం రైతులను అయోమయానికి గురి చేస్తోంది. ఇస్తే అంతా నగదు రూపంలో గాని చెక్కు రూపంలో గాని ఇవ్వాలి. కానీ అలా కాకుండా ఇదేమిటని విచారణ చేసిన రైతులకు విస్తుపోయే నిజాలు వెలుగులోనికి వస్తున్నాయి. పక్క పక్కనే ఉన్న పొలాలకు ఒకరికి ఒకరేటు, మరొకరికి మరో రేటు ఇస్తున్నట్లు రైతులు గుర్తించారు. ఏది ఏమైనా రైతుల నుంచి రెండు నుంచి ఐదు లక్షల రూపాయల వరకు దళారులు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

పోలీసులకు ఫిర్యాదు..

తమకు తెలియకుండానే తమ పంట పొలంలో సోలార్ కంపెనీ ఫినిషింగ్ స్తంభాలు నాటుతోందంటూ పెద్దముడియం పోలీసు స్టేషన్‌లో కల్వటాల గ్రామానికి చెందిన నలుగురు రైతులు ఫిర్యాదు చేశారు. తమ పొలంలో తమ అనుమతులు లేకుండా లోతుగా గుంతలు తీసి అందులో కాంక్రీటు వేయడం వల్ల పొలాలు దెబ్బతింటున్నాయని శ్రీనివాసులు, పెద్దిరాజు, భూలక్ష్మి, చిన్న బాల గంగన్న ఫిర్యాదు చేశారు.

కోర్టుకు వెళతాను



నా పొలంలో నాకు తెలియకుండా సోలార్ కంపెనీ వారు స్తంభాలు పాతారు. ఇదేమని అడిగితే పొరపాటు అయిందని చెబుతున్నారు. మా పొలాలు అని తెలిసి కూడా ఇబ్బందులు పెట్టేందుకు పాతారు. పొలాలకు దారి ఉండదంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

– శ్రీనివాసులు, కల్వటాల, పెద్దముడియం మండలం

భూములు దెబ్బతిన్నాయి



నాకున్న 75 సెంట్ల భూమిలో సోలార్ కంపెనీ లోతైన గుంతలు తీసింది. అంతేకాకుండా కాంక్రీటుతో కూడిన స్తంభాలు నాటుతున్నారు. పొలంలో పంట వేసుకోవాలంటే ఎలా వేసుకోవాలి. కంపెనీ మాకు కనీసం 15 లక్షల రూపాయల పరిహారం ఇవ్వాలి.

– నాగరాజుపల్లి పెద్దిరాజు

ఆన్‌లైన్ మోసగాళ్ల అరెస్టు

మదనపల్లె : ఆన్‌లైన్ మోసానికి సంబంధించిన కేసులో, మదనపల్లె నీరుగట్టువారి పల్లెకు చెందిన ముగ్గురు నిందితులను కర్ణాటక రాష్ట్రం హుబ్లీ పోలీసులు శనివారం అరెస్టు చేసి కర్ణాటకకు తరలించారు. సౌదీలో ఉంటున్న ఓ వ్యక్తి మదనపల్లె నీరుగట్టువారి పల్లెకు చెందిన ముగ్గురు వ్యక్తులతో ఆన్‌లైన్ పరిచయం పెంచుకున్నాడు. వారి సహాయంతో షేర్ మార్కెట్‌కు సంబంధించిన నకిలీ యాప్ సృష్టించాడు. ఈ యాప్ ద్వారా కర్ణాటక రాష్ట్రం హుబ్లీ పరిసర ప్రాంతాల్లో పలువురి వద్ద నుంచి పెద్ద ఎత్తున పెట్టుబడులు సేకరించారు. ఈ యాప్‌లో పెట్టుబడులు పెడితే, వాటిని అంతర్జాతీయ షేర్ మార్కెట్‌కు మళ్లించి, పెద్ద మొత్తంలో కమీషన్లు తిరిగి చెల్లిస్తామని బాధితులను నమ్మించారు. దీంతో పెద్ద మొత్తంలో నకిలీ యాప్ ద్వారా వారికి పెట్టుబడులు అందాయి. పెట్టుబడిదారుల నుంచి బ్యాంకు ఖాతా, ఏటీఎం, పిన్ తదితర వివరాలను ధ్రువపత్రాలతో పాటు సేకరించారు. కొంతమందికి కమీషన్ల రూపంలో నగదు తిరిగి యాప్ ద్వారా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. ఇలా నమ్మకం కుదరడంతో మౌత్ పబ్లిసిటీ ద్వారా నకిలీ యాప్‌లో పెద్ద మొత్తంలో పలువురు పెట్టుబడులు పెట్టారు. అయితే యాప్‌లో పెట్టుబడులు పెట్టిన కర్ణాటక రాష్ట్రం హుబ్లీకి చెందిన ఓ వ్యక్తి బ్యాంకు ఖాతా నుంచి ఇటీవల, అతనికి తెలియకుండా రూ. 15 లక్షలు మాయమయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన బాధితుడు హుబ్లీ పోలీసులకు ఆన్‌లైన్ మోసంపై ఫిర్యాదు చేశాడు. కేసును విచారించిన హుబ్లీ పోలీసులు నకిలీ యాప్‌కు సంబంధించిన ముగ్గురు నిందితుల బ్యాంకు ఖాతాల్లో రూ. 70 – 80 లక్షలు జమ అయినట్లు నిర్ధారించారు. ఆయా ఖాతాల నుంచే నకిలీ యాప్ పెట్టుబడిదారులకు లావాదేవీలు నిర్వహించినట్లు గుర్తించారు. దీంతో నిందితులను పట్టుకునేందుకు హుబ్లీ పోలీసులు శుక్రవారం మదనపల్లెకు చేరుకున్నారు. . శనివారం టూ టౌన్ పోలీసుల సాయంతో నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

సాంకేతికతను వినియోగించుకోవాలి

ఐకార్ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్.మీరా

మైదుకూరు : రైతులు సాంకేతికతను వినియోగించుకోవాలని భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐకార్) అటారి జోన్–10 డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్. మీరా అన్నారు. శనివారం మైదుకూరు మండలం వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో 8వ శాస్త్రీయ సలహా సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న డాక్టర్ మీరా మాట్లాడుతూ వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం పరిధిలో ఉద్యాన పంటలు ఎక్కువగా సాగవుతున్నాయని తెలిపారు. ఈ పంటలకు డ్రోన్ల ద్వారా మందులను పిచికారీ చేసుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం అభివృద్ధికి మరింత కృషి చేసి రైతులకు ఆదాయం పెరిగేలా చూడాలన్నారు. సేంద్రీయ ఉత్పత్తులకు బ్రాండ్‌ను సిద్ధం చేయాలని సూచించారు. నర్సరీలు, పశువుల్లో కొత్త రకాలను తీసుకురావాలని తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టర్ బి.గోవిందరాజులు మాట్లాడుతూ పసుపు, అరటి తదితర ఉద్యాన పంటల అభివృద్ధికి రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో కలిసి పని చేయాలన్నారు. ఊటుకూరు కేవీకే ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ వీరయ్య, వనిపెంట కేవీకే అధిపతి శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ, పులివెందుల అరటి పరిశోధనా కేంద్రం ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ శివరామకృష్ణ, శాస్త్రవేత్తలు ఫిరోజ్ హుస్సేన్, శ్రీవిద్యారాణి, కాంతిశ్రీ, అంకయ్య, యోహాన్, రంజిత్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం ప్రవీణ్ తదితరులు మాట్లాడారు. సమావేశంలో రైతులకు స్ప్రేయర్లు, పారలు, కొడవళ్లు, కోళ్లను పంపిణీ చేశారు.


రైతులకు స్ప్రేయర్‌ను అందిస్తున్న ఐకార్ డైరెక్టర్ డాక్టర్ మీరా

మహిళ అదృశ్యం


విజయలక్ష్మీదేవి (ఫైల్)

లింగాల : మండలంలోని అంబకపల్లె గ్రామానికి చెందిన బండి విజయలక్ష్మీదేవి (34) అనే మహిళ గతనెల 4వ తేదీనుంచి అదృశ్యమైనట్లు ఆమె భర్త బండి పురుషోత్తమరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ ఆమె ఆచూకీ తెలియకపోవడంతో కరపత్రాలను విడుదల చేశారు. ఆచూకీ తెలిస్తే 9121100551, 9121100549, 9121100545 అనే ఫోన్ నంబర్లకు తెలియజేయాలని కోరారు.

విద్యార్థి..


బోయ రాజేశ్వరి (ఫైల్)

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రస్తుతం అశోక్‌నగర్‌లో నివాసం ఉంటున్న బోయ హనుమంతు కుమార్తె బోయ రాజేశ్వరి (17) అనే విద్యార్థిని కడప నగరంలోని జయనగర్ కాలనీలో ఉన్న జిల్లా పరిషత్ గరల్స్ హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతోంది. రోజు మాదిరిగానే శనివారం ఉదయం తాను పాఠశాలకు వెళుతున్నానని ఇంటిలో చెప్పి వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోయేసరికి చుట్టుపక్కల విచారించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ బాలిక ఆచూకీ తెలిసిన వెంటనే చిన్నచౌక్ సీఐ 9121100520 కుగానీ, ఎస్‌ఐలు 9121100521, 9121100522కు గానీ సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో హుండీ చోరీ


చోరీకి గురైన హుండీని పరిశీలిస్తున్న బద్వేలు రూరల్ పోలీసులు, గ్రామస్తులు

గోపవరం : మండలంలోని పెద్ద గోపవరం గ్రామంలో ఉన్న శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం హుండీ శుక్రవారం రాత్రి చోరీకి గురైంది. ఈ ఆలయం దేవదాయశాఖ పరిధిలో ఉంది. ప్రతి ఏటా బ్రహ్మోత్సవాలు కూడా నిర్వహిస్తారు. గత మూడేళ్లుగా హుండీని లెక్కించలేదు. ఈ నేపథ్యంలో దుండగులు హుండీని ఎత్తుకెళ్లి అందులో ఉన్న నగదును తీసుకుని పొలాల్లో పడేశారు. అయితే హడావుడిలో ఇంకా కొంత నగదును దుండగులు హుండీలోనే వదిలేసి వెళ్లారు. ఉదయం పొలాల్లో పడి ఉన్న హుండీని చూసి వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన హుండీగా గ్రామస్తులు గుర్తించారు. చోరీకి గురైన నగదు రూ.లక్షకు పైగానే ఉంటుందని స్థానికులు తెలిపారు. హుండీ చోరీకి గురైన విషయాన్ని బద్వేలు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు వచ్చి పరిశీలించి కేసు నమోదు చేశారు. కాగా ఇదే గ్రామంలో వరుస చోరీలు జరుగుతున్నా పోలీసులు మాత్రం ఇప్పటి వరకు ఒక్క చోరీ కేసును కూడా ఛేదించకపోవడం చర్చనీయాంశంగా మారింది.

న్యాయం కోసం పోలీసు స్టేషన్ ఎదుట బైఠాయింపు


కలమల్ల పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న గొర్ల చిన్న ఓబులేసు


బాధితుడితో మాట్లాడుతున్న సీఐ మహమ్మద్ రఫీ

ఎర్రగుంట్ల : తమకు న్యాయం చేయాలని కోరుతూ మండల పరిధిలోని కలమల్ల పోలీస్ స్టేషన్ ఎదుట రోడ్డుపైన బైఠాయించి బాధితుడు గొర్ల చిన్నఓబులేసు ధర్నాకు దిగిన సంఘటన శనివారం జరిగింది. బాధితుడు మాట్లాడుతూ కలమల్ల గ్రామానికి చెందిన పొన్న శివ అనే వ్యక్తిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎస్‌ఐ తిమోతీ పట్టించుకోలేదన్నారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశామన్నారు. తర్వాత జనవరి, సంక్రాంతి పండుగలకు సంబంధించి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిలకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆర్టీపీపీ గేటు వద్ద తాను వేసిన ఫ్లెక్సీని చించేశారన్నారు. దీనిపై ఫిర్యాదు చేసినా ఎస్‌ఐ పట్టించుకోలేదన్నారు. ఇది ఏమిటని అడిగితే ఎస్‌ఐ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ధర్నా విషయం తెలుసుకున్న వెంటనే కొండాపురం సీఐ మహమ్మద్ రఫీ కలమల్లకు వచ్చి బాధితుడు గొర్ల చిన్నఓబులేసుతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు. సీఐ మాట్లాడుతూ గతంలో ఓబులేసు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. అయితే ఎస్‌ఐ తిమోతి సరైన సమాధానం చెప్పలేదంటూ బాధితుడు ఆరోపించాడన్నారు. ఈ విషయాన్ని జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

ఏఎన్‌ఎం ఆత్మహత్యాయత్నం

పరీక్షలకు సెలవు అడిగితే దుర్భాషలాడిన వైద్యాధికారి


చేయి కోసుకుని రోదిస్తున్న ఏఎన్‌ఎం సింధూ

చాపాడు : మండలంలోని నక్కలదిన్నె పీహెచ్‌సీ పరిధిలోని అయ్యవారిపల్లె గ్రామ సచివాలయ ఏఎన్‌ఎం సింధూ శనివారం సాయంత్రం పీహెచ్‌సీ ఆవరణంలో గాజుతో చేయి కోసుకుని ఆత్మాహత్యయత్నానికి పాల్పడింది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. ఏఎన్‌ఎం సింధూ దూర విద్యా విధానంలో శ్రీ వెంకటేశ్వర ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చదువుకుంటోంది. ఈ నెల 24 నుంచి ఫైనలియర్ పరీక్షలు ఉన్నాయి. దీంతో మూడు రోజుల నుంచి వైద్యాధికారిణి కావ్య మాధురిని పరీక్షల కోసమని సెలవు అడుగగా ఎంఎల్‌హెచ్‌పీ ఉషా అనుమతి ఇస్తే సెలవు ఇస్తానని లేకుంటే ఇవ్వనని తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీ ఉషాను అడిగితే తనకు ఎలాంటి సంబంధం లేదని నీవు సెలవుపై వెళితే పనులెవరు చేస్తారని, అయినా ఇప్పుడు పరీక్షలు రాయకపోతే మరెప్పుడైనా రాసుకోవచ్చని అవహేళన చేశారు. సింధూ 3.40 గంటలకు పీహెచ్‌సీ వద్దకు చేరుకోగా అప్పటికే వైద్యాధికారిణి కావ్య మాధురి వెళ్లిపోయారు. దీంతో సింధూ వైద్యాధికారిణికి ఫోన్ చేయగా నీకు ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగం ఉందని డిగ్రీలు అవసరమా.. పరీక్షలు ఎప్పుడైనా రాసుకోవచ్చని సెలవు ఇవ్వడం కుదరని చెప్పడమే గాక మీ ఫోన్లు లిఫ్ట్ చేయాలంటేనే కంపరంగా ఉంటుందని మాట్లాడారు. దీంతో మనస్థాపానికి గురైన ఏఎన్‌ఎం సింధూ తన చేతికి ఉన్న గాజులతో ఎడమ చేయి కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో స్థానికులు గుర్తించి తోటి వైద్య సిబ్బందికి సమాచారం ఇచ్చి 108 వాహనం ద్వారా ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని బాధితురాలు కోరుతోంది. గత నెలలో ఏఎన్‌ఎం సింధూ తన కుమారుడికి అనారోగ్యం కారణంగా సెలవు అడిగినప్పటికీ ఇవ్వకపోడంతో జిల్లా వైద్యాధికారిని సంప్రదించాల్సి వచ్చింది. కాగా మరి కొందరు సిఫార్సులు చేయించుకోగా సెలవు ఇచ్చినట్లు తెలుస్తోంది.

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నిక


అసోసియేషన్ సభ్యులకు నియామక పత్రాలను అందజేస్తున్న ఎక్సైజ్ అధికారులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు. అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా బి. కృష్ణకుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా టి.శశిధర్, వైస్ ప్రెసిడెంట్‌గా బి.ఎల్లయ్య, సెక్రటరీగా సి.సురేష్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వినీలతతో పాటు పలువురిని అసోసియేషన్ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

అదృశ్యమై.. శవంగా మారిన చిలంకూరు వాసి


శివరామిరెడ్డి (ఫైల్)


మల్లేల ఘాట్‌లో లభ్యమైన శివరామిరెడ్డి మృతదేహం

ఎర్రగుంట్ల/తొండూరు : ఎర్రగుంట్ల మండలం పరిధిలోని చిలంకూరు గ్రామానికి చెందిన శివరామిరెడ్డి(56) అనే వ్యక్తి ఈ నెల18 తేదీన కనిపించకుండా పోవడంతో అతని కుటుంబ సభ్యులు ఎర్రగుంట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాలుగు రోజుల తర్వాత శివరామిరెడ్డి తొండూరు మండలం మల్లెల ఘాట్‌లో శవమై కన్పించడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు. వివాహేతర సంబంధం కారణంగా శివరామిరెడ్డిని హత్య చేసి ఘాట్‌లో పడేసినట్లు తెలుస్తోంది. శనివారం ఎర్రగుంట్ల పోలీసులు మల్లేల ఘాట్‌కు చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. శివరామిరెడ్డిని ఓ మహిళ సహకారంతో ఓ వ్యక్తి హత్య చేసిన అనంతరం శవాన్ని ఓ వాహనంలో తీసుకుని వెళ్లి ఘాట్‌లో పడేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలినట్లు తెలుస్తోంది. ఈ కేసుకు సంబంధించి పూర్తి సమాచారాన్ని రాబట్టే పనిలో ఎర్రగుంట్ల పోలీసులు నిమగ్నమయ్యారు.

రెచ్చిపోతున్న బెట్టింగ్ బ్యాచ్

- దాడులు మరచిన పోలీసులు
- యాప్‌ల ద్వారా జోరుగా సాగుతున్న క్రికెట్ బెట్టింగ్
- నేడు ఇండియా–పాకిస్తాన్‌ల మధ్య హై ఓల్టేజి క్రికెట్ మ్యాచ్

ప్రొద్దుటూరు క్రైం : తెలుగు రాష్ట్రాల్లో ప్రొద్దుటూరు పేరు తెలియని వారుండరు. వాణిజ్యానికి ప్రసిద్ధి చెందిన ప్రొద్దుటూరులో నేర సామ్రాజ్యం విస్తరిస్తోంది. ఇక్కడ జరగని అసాంఘిక కార్యక్రమాలంటూ ఏమీ ఉండవు. వాటిలో క్రికెట్ బెట్టింగ్‌ది అగ్రస్థానం కాగా మట్కాది తర్వాత స్థానం అని చెప్పొచ్చు. పేకాట, ఇతరత్రా కార్యకలాపాలు సర్వసాధారణమయ్యాయి. కొన్నేళ్ల క్రితమే ఇక్కడి ప్రధాన బుకీలు తెలుగు రాష్ట్రాలకు క్రికెట్ బెట్టింగ్‌ను పరిచయం చేశారని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ప్రొద్దుటూరులో ప్రారంభమైన క్రికెట్ బెట్టింగ్ ఏనాడో జిల్లాలు దాటింది. ఇప్పటికీ సీనియర్లు కొందరు ఇదే వృత్తిని కొనసాగిస్తున్నా యువబుకీలు అనేక మంది బెట్టింగ్ రంగంలోకి అడుగు పెట్టారు. టెక్నాలజీని అందిపుచ్చుకొని యాప్‌ల ద్వారా బెట్టింగ్ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ప్రొద్దుటూరుతో పాటు కడప, రాయచోటి, రాజంపేట, జమ్మలమడుగు, ఆర్టీపీపీ తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున క్రికెట్ బెట్టింగ్ జరుగుతోంది.

కౌన్సెలింగ్ మరచిన పోలీసులు

క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభమయ్యే సమయంలో స్థానికంగా ఉన్న క్రికెట్ బుకీలను పోలీసులు స్టేషన్‌లకు పిలిపించేవారు. వారికి కౌన్సెలింగ్ ఇవ్వడమే గాక మ్యాచ్ ముగిసే వరకు పోలీస్ స్టేషన్‌లోనే కూర్చోబెట్టేవారు. జిల్లా స్థాయి అధికారులు కూడా బుకీలను కడపకు పిలిపించి తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేవారు. కొన్ని నెలల నుంచి వరుసగా క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో పోలీసుల వైపు నుంచి ఎలాంటి చర్యలు కనిపించడం లేదు.

నేడు ఇండియా–పాకిస్తాన్ మ్యాచ్

ఛాంపియన్స్‌ట్రోఫీలో భాగంగా ఆదివారం చిరకాల ప్రత్యర్థులు ఇండియా–పాకిస్తాన్ దేశాల మధ్య హైవోల్టేజి క్రికెట్ మ్యాచ్ జరగనుంది. కోట్లాది మంది క్రికెట్ అభిమానులు ఈ మ్యాచ్‌ను ఎంతో ఆసక్తిగా తిలకిస్తారు. ఈ క్రికెట్ మ్యాచ్‌పై పందేలు పెట్టేవారు ఎక్కువగానే ఉన్నారు. క్రికెట్ అభిమానుల బలహీనతను దృష్టిలో పెట్టుకొని బుకీలు ఆఫ్‌లైన్‌లో పందేల నిర్వహణకు ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రధాన బుకీలు హైదరాబాద్, గోవా, దుబాయ్ ప్రాంతాలకు వెళ్లినట్లు తెలుస్తోంది.

క్రికెట్ బుకీలపై నిఘా పెట్టాం

క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న వారిపై నిఘా పెట్టాం. గతంలో కేసుల్లో ఉన్న వారిని గుర్తించి దాడులు నిర్వహిస్తాం. బెట్టింగ్ కట్టడికి ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశాం. ఇండియా–పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా పట్టణంలో అదనపు బలగాలను ఏర్పాటు చేశాం.

– పి భావన, ప్రొద్దుటూరు డీఎస్పీ

విజిలెన్స్ అధికారుల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకుల తనిఖీ


పెట్రోల్ బంకులో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

కడప అర్బన్ : కడప రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ జి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం విజిలెన్స్ అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులు, పౌరసరఫరాల శాఖాధికారులతో కలిసి జిల్లాలోని కడప, ప్రొద్దుటూరు, అన్నమయ్య జిల్లా రాయచోటిలో పెట్రోల్ బంకులలో ఆకస్మిక తనిఖీ చేశారు.

- కడప నగరం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో తేజా ఫిల్లింగ్ సెంటర్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు తనిఖీలు చేపట్టారు. ఎలాంటి లోపాలు కనిపించకపోవడంతో వెనుదిరిగారు. అలాగే కడప నగరం వినాయకనగర్‌లోని కె.ఎస్. చెట్టి అండ్ సన్స్, ప్రొద్దుటూరులో కూడా తనిఖీలు నిర్వహించారు. దీంతోపాటు అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఎస్.ఎన్ కాలనీలో శ్రీ సాయి బాలాజీ ఏజెన్సీ, శ్రీ సాయి రజిత ఫిల్లింగ్ స్టేషన్‌లలో తనిఖీలు చేశారు. పెట్రోల్ బంకుల యజమానులు నియమ నిబంధనలకు అనుగుణంగా పెట్రోల్, డీజిల్ అమ్మకాలు చేయాలని విజిలెన్స్ అధికారులు సూచించారు. ఈ తనిఖీలలో కడప రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి జి. శ్రీనివాసరావు స్వయంగా పాల్గొని సూచనలు చేశారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్లు ఎం. శివన్న, ఎస్. నారాయణప్ప, డీఈఈ ఏ.వీ. జవహర్‌రెడ్డి, ఏఈఈలు కె. విజయ్‌కిషోర్, వి.అశోక్‌కుమార్, డీసీటీఓ బి. గీతావాణి, ఎస్. ఖాజాహుసేన్, బి. బాబు మోజెస్, రమేష్‌రెడ్డి, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రమేష్‌రెడ్డి, ఏఎస్‌ఓ తారకనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.